పెద్దకథ :-

# ★ కామిని ★

రచయిత: సి. కె. రావు

జరిగిన కథ

కార్తీక పౌర్ణమినాడు కౌశంబీ నగరంలోని మహేశ్వరాలంలో తొలినాటి కామిని అనే వేశ్య గజ్జెకట్టి మనోహరనృత్యం చేసింది. ఆమె సౌందర్యానికి, నాట్యానికి ముగ్ధుడయి మోహావశుడైన యువరాజు మదనవర్మ ఆమెను అంతఃపుర వాసినిగా చేసాడు. కామిని గర్భవతి అయింది అందువలన కామిని తనను నిర్లక్ష్యం చేస్తోందన్న దురహంకారంతో ఆమెను అంతఃపురంనుంచి సాగనంపడమే కాక ఆమెను బందీచేసి ఆమె తనవేశ్యా ధర్మాన్ని ఉల్లంఘిస్తోందన్న ఆరోపణకూడ చేసి విచారణ జరిపిస్తాడు.

మహారాజు:- ఈ విషయంలో న్యాయశాస్త్రకారుల యభిప్రాయమేమిటో తెలుపగోరుతాను.

న్యాయవాది:- ప్రభువువారు మన్నించాలి. న్యాయస్థానం యేర్పడినది మానవుల కోసమే నన్న విషయం వేరే చెప్పవలసి వుంటుందనుకోలేదు. కానీ నేరవిచారణ సందర్భంలో నిందితుణ్ణి లేక నిందితురాలిని వారివారి చర్యలనుబట్టి, అవి దేశానికి గాని, ప్రజాభద్రతకి గాని, సమాజక్షేమానికిగాని కల్గించగల కీడును బట్టి మాత్రమే నిర్ణయించవలసివుంటుంది. అందుచేత నిందితురాలికీ వేశ్యాప్రపత్తినిచ్చి విచారణ జరపడం న్యాయశాస్త్రరీత్యాసబబు.

కామిని:- 'న్యాయశాస్త్రం, న్యాయశాస్త్రం' పదేపదే వుల్లేఖిస్తున్నారు. మీ న్యాయశాస్త్రం మానవ ప్రాథమిక స్వత్వాలు ప్రాతిపదికగా నిర్మితమైనదని మీరు విశ్వసిస్తే మానవిగా అంగీకరింపబడిన నా ప్రాథమికహక్కులని ఎందుకు త్రోసి రాజంటున్నారు. విజ్ఞతాసహితమైన నా నైతిక ప్రవృత్తిని ఎందుకు గర్హిస్తున్నారు. ధర్మరక్షణకీ, అవినీతి నిర్మూలనానికీ తోడ్పడవలసిన న్యాయశాస్త్రం ధర్మాన్నీ నీతినీ అనుసరించదలుచుకున్న నన్ను ఎందుకు శిక్షింపబూనుకున్నది? నాకున్న ప్రాథమిక హక్కులని దుర్వినియోగ పరచి నేనేమీ అధర్మానికీ, అవినీతికీ పాల్పడలేదు. మీరు దేనినైతే అధర్మం, అవినీతి అంటున్నారో దానికి నేను దూరంగా వుండదలుచుకున్నాను. పుణ్యంకోసం- స్వర్గంకోసం గాదు. నా తత్త్వానికి సరిపడలేదు. అంతే. కాని దాన్ని మీరు పాపమంటున్నారు. పంచమహాపాతకాల్లో వ్యభిచారమొకటని అంటున్నారు. అయినా ఆ పాపాచరణ జరిగి తీరవలసిందేనంటూ దానికోసం కొంతమందిని ప్రత్యేకిస్తున్నారు కూడా. వారిలో నెవరైనా నా అనురాగంలోని మాధుర్యాన్ని చవిచూసి, అమలీనమై అనుభూతి కోసం సమాజంలోని యితర స్త్రీలలాగానే తమ హృదయాన్నీ, శరీరాన్నీ, యే ఒక పురుషుడికో యిచ్చి అతని జీవితంతో తన జీవితాన్ని యేకంచేసి తన బ్రతుకుని మరింత ఉజ్జ్వలంగానూ, సార్థకవంతంగానూ చేసికోవాలని ప్రయత్నిస్తే వారిని పాపి అంటున్నారు. హృదయపూర్వకంగా కాకపోయినా తెచ్చిపెట్టుకొన్న వేటగాని మనస్తత్త్వంతో పరస్పర విరుద్ధమైన మీ యీ తత్త్వాల్ని సమన్వయించుకోలేక సమర్థించుకోలేక మీరు సమర్థించలేని విషయాన్ని మీ పక్షాన బలపరిచేందుకు న్యాయశాస్త్రాన్ని నిర్మించారు. ...

న్యాయవాది:- (అడ్డువచ్చి) నిందితురాలు చట్టాన్ని నిందించడానికి పూనుకున్నది. ఇది చాల దుర్మార్గం. నిగ్రహంతో వ్యవహరించకపోతే దారుణమైన శిక్షకి పాల్పడవలసివస్తుంది.

కామిని:- నేను ప్రభువులవారిని కోరేది ఒక్కటే. స్త్రీత్వం తాలూకు ఒక సత్యం. నా హృదయంలో పొరలిపోతోంది. గానీ కన్ను తెరువకుండా గొంతు నులిమి, అవతల పారవేయగల్గిన శక్తి వున్నట్లయితే నాకీనాడు యీ న్యాయస్థానంలో నిందితురాలినిగా నిలబడవలసిన గతే వచ్చేదికాదు. దారుణశిక్ష అని నన్నేదో భయపెట్ట చూస్తున్నారు. కాని అంతకన్న వేయిరెట్లు దారుణమైన ఆత్మవంచననుండి నన్ను నేను కాపాడుకోగలిగానన్న సంతృప్తిలో మీరు విధించేది యెంత దారుణశిక్షైనా నాకు భయం వేయడంలేదు. కాని చట్టం కల్పిస్తున్న రక్షణలో కొందరు స్వార్థపరులు నా మొహాన డబ్బుకొట్టి నా హృదయాన్ని ముక్కచెక్కలుగా తెగనరికి పంచుకోవాలని చూస్తున్నారు. నా శరీరాన్ని వీలైనంతమంది నా యిష్టానిష్టాలతో నిమిత్తంలేకుండా అనుభవించాలని వువ్విళ్ళూరుతున్నారు. స్త్రీగా వ్యక్తిత్వాన్ని వుండవలసిన అంతస్థు నుండి తమ స్వీయకాంక్షాపూర్తికవసరమైన పరిధుల్లోకి వదిలాలని క్రూరంగా ప్రయత్నిస్తున్నారు. నాలాంటి స్త్రీలు కొందరు తాము కోరిన పురుషుణ్ణి వివాహమాడి కలకలలాడుతూ శుభ్రమైన అనుభవాలతో మనస్సులతో జీవిస్తున్నారు. వారివలనే జన్మించిన నాకు వారికంటే అధికంగా కాకపోయినా వారివలెనైనా మనగల హక్కుని ఎందుకు నిషేధించాలి ఇలా

అడగడం చట్టాన్ని అతిక్రమించడం అన్న నేరం క్రిందికి వస్తే రావచ్చు. కాని యీగా అడగడం నా కనీసపువిధి. ఈ స్థానికిలో అంగబలం, అర్థబలం లేని నా యీ నైతికదృష్టి, ధార్మికచింత దౌర్జన్యంగా అణచివేయబడవచ్చు. కాని నేను నిలబడక తప్పదు.

న్యాయవాది:- నిందితురాలి సమాధాన మేమో తెలిసిపోయింది. ఇంక న్యాయమూర్తియైన ప్రభువువారు చట్టం ప్రకారం తీర్పు చెప్పవలసివున్నది.

యువరాజు మదనవర్మ సహనశీలితో లేచి 'నిందితురాలు తన పొరపాటుని అంగీకరిస్తే ప్రథమదోషంగా పరిగణించి విముక్తిని ప్రసాదించవచ్చు.'

కామిని తలెత్తి యువరాజు వంక చూసింది. అసహ్యంతో కూడుకున్న అవమానభారంతో ఆమె తల వ్రాలిపోయింది క్రమక్రమంగా వృద్ధి చెందుతున్న తన గర్భంమీదికి మళ్ళినవి ఆమె చూపులు కన్నీళ్ళు ఆపుకోలేకపోయింది.

మదనవర్మ హృదయంలో ఆరాటం బయలుదేరింది. తాననుకున్న దంతా తలక్రిందులవుతోంది. తన వేడికోలుకీ, ఆగ్రహానికీ చలించని కామినికి తన అధికారాన్నీ, రాజ్యంలోని సామాజికగతినీ చూపించి వశపరుచుకోవాలనుకున్నాడు. ఆమెని శిక్షకి పాల్జేసి తనకి దూరం చేసికోవాలనే వుద్దేశ్యమేలేదు. కాని తన నిర్ణయానికి శిక్షేమిటో తెలిసికూడా కామిని చలించకుండా ముందడుగు వేస్తోంది. ఇది చాల ప్రమాదభరితమైన స్థితి. ఇందులోనుండి కామినిని తప్పించాలంటే ఒక్కటే మార్గం తన ఓటమిని అంగీకరించడమే." చివాల్న తన ఆసనంనుండి లేచి 'కామినీ అంగీకరించు... నాకోసమైనా' అన్నాడు.

మహారాజు:- యువరాజా! ఇది నీ అంతఃపుర మందిరంగాదు, న్యాయస్థానం అదీ మనసులో వుంచుకొని మాట్లాడండి.

కామిని:- మీరు (నాలిక కొరుక్కొని) యువరాజువారు యీ దీనురాలికోసం చాల శ్రమతీసుకొంటున్నారు. కాని కామిని పొరబాటు చేయలేదు. అందువల్ల క్షమాపణ వేడే ప్రశ్నే లేదు. తీర్పుకి ఎదురుచూస్తున్నాను.

మదనవర్మ:- పోనీండి. ఆమె ప్రశ్నలకి నేను సమాధానం చెప్పలేకపోయాను నా ఆరోపణని నేను వుపసంహరించుకుంటున్నాను. ఆమెకి విముక్తి ప్రసాదించండి.

న్యాయవాది: క్షమించండి. ప్రస్తుతం అలా చేయడానికి వీలుపడదు. యువరాజువారు వారి వ్యక్తిగత ఆపేక్షలవల్ల తమ ఆరోపణని ఉపసంహరించుకున్నా యిది సామాజికమైన నేరం. సమాజసంబంధమైన ఆరోపణని ఉపసంహరించే హక్కు ఎవరికీలేదు.

మదనవర్మ:- ఎవరు తెచ్చిన అభియోగాన్ని వుపసంహరించుకునే హక్కు వారికి లేదా మహారాజా!

మహారాజు:- యువరాజా! ఈ అభియోగం మీ వ్యక్తిగతమైన అవధుల్లోనే వున్నట్లయితే ఆరోపించిన మీకు వుపసంహరించుకొనే హక్కుగూడా వుండేదే. కాని కామిని స్వయంగా అంగీకరించడంతో యీ అభియోగం యింకా విస్తృతమైన అవధుల్లోకి విసిరివేయబడి సామాజికమై కూర్చుంది. నీ హక్కుని కోల్పోయావు.

మదనవర్మ:- అయితే కామిని ప్రశ్నలకి సమాధాన మివ్వవలసివుంటుంది. ఇందులో యే 'ఒక్కని' అభిప్రాయమూ తగింది కాదు. ఆమె సమాజాన్ని నిలదీసి అడిగింది! ' ఎందుకు మీనుండి నన్ను దూరంగా త్రోసివేస్తారు. మంచివనీ, సభ్యతగలవనీ మీరనుసరిస్తున్న విధానాలను నేనెందుకు అనుసరించగూడదు. అని ఈ ప్రశ్నకి యావత్తు సమాజం ప్రత్యుత్తరం చెప్పవలసివుంది.

కామిని సజలనేత్రాలలో ఆశ్చర్యం, కృతజ్ఞత తొణికిసలాడినవి తన ఆరాధ్యదైవం పూర్తిగా కిరాతుడైపోలేదు. అతనిలో యింకా మానవత్వం కొనవూపిరితో పెనగులాడుతూనే వుంది. అది యిప్పుడే పుంజుకొని బలం చేకూర్చుకుంటోంది. కాని లాభమేమిటి? ... ... చేతులు కాలనేకాలాయి. ఇప్పుడు వారి చేతుల్లో యేమీలేదు. అంతా ముగిసినట్లే ఆనాడు మహేశ్వరాలయంలో పరమేశ్వరుసాక్షిగా కలకలనవ్వే కళ్ళతో పులకించిపోయే గాత్రాలతో అన్యోన్యం ఆలపించుకున్నారు నాందీగీతం. ఈ నాడు కలకలు బారుతున్న కళ్ళతో కుంచించుకుపోతున్న గాత్రాలతో విషాదాంతం కాబోతున్న ఆ నాటకానికీ భరతవాక్యం పలకబోతున్నారు. తన జీవితం సర్వం ... సమాప్తం తనకి శిక్ష తప్పాలంటే ప్రళయంలాంటి దేదైనా రావాలి.'

ఇంతలో న్యాయవాది గొంతువినిపించింది 'ఇక్కడవున్న న్యాయస్థాన సభ్యులైదుగురూ రాజ్యంలోని ప్రజలకి ప్రతివిషయంలోనూ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రాతినిధ్యం మహారాజువారి చేత గుర్తింపబడినది వారి సలహాతో మహారాజువారు తీర్పివ్వడం అనూచానంగా వస్తున్న ఆచారం యువరాజువారికి తెలుసునుకుంటాను.

మదనవర్మ:- కాని అది సమగ్రమైందిగాదు. సమస్యను ప్రజల ముందుంచి వారి నిర్ణయం తీసికోవాలి. అది వుచితం.

మహారాజు:- ప్రతివిషయంలోనూ అలా వీలుపడలేదనే ప్రజాప్రతినిధుల్ని ఆహ్వానించింది. ఇప్పుడు వారి అభిప్రాయం ప్రకారం నడుచుకోకపోతే రాజ్యంలోని వారందరికోసం మన మంగీకరించిన నియమం ఒక సందర్భంలో మన వ్యక్తిగత విషయాల్లో తృప్తినివ్వలేదని నిరాకరించడమే అవుతుంది.

మదనవర్మ:- నాకు కావలసింది న్యాయం.

మహారాజు:- ఇది న్యాయస్థానమన్న స్మృతి అవసరం.

యువరాజు చివాల్న లేచి వెళ్ళిపోయాడు.

కామిని చెక్కిళ్ళమీద జారుతున్న కన్నీటిని చిమ్మివేసింది.

మహారాజు:- సభ్యుల నిర్ణయం యేమిటి?

సభ్యులు కొంతసేపు సంప్రదించుకున్నారు. వారిలో వారికి అభిప్రాయభేదాలు వచ్చినవి. ఇద్దరు కామిని వుద్దేశ్యం చట్టప్రకారం నేరమైనా మానవతత్త్వ సహజ పరిణామం దృష్ట్యా అత్యంతసమంజసమనీ, తక్కినవర్గాల

స్త్రీలకున్న స్వేచ్ఛని కామినికి నిరాకరించడంలో స్వార్థపరమైన దృక్పథం తప్ప మరో పరమార్థమేమీలేదని తమ యభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాని తక్కిన ముగ్గురూ కామిని శిక్షార్హ యని నిర్ణయించారు. మహారాజు తీర్పు మరునాటికి వాయిదా వేశాడు.

రాత్రి చాల ప్రొద్దుపోయింది. యువరాజు మదనవర్మ తల మేడ పై భాగంలో చీకట్లు క్రక్కుతున్న ఆకాశం క్రింద కూర్చుని కామినితో వెన్నెలలాంటి స్వచ్ఛమైన సుఖానుభూతుల్ని సింహావలోకనం చేసుకుంటున్నాడు. ఎంత సరిపెట్టుకున్నా తన దోషం స్పష్టంగా నక్షత్రాలని దూసుకువస్తున్న వెలుగురేకలాగా తనకి కన్పిస్తూనేవుంది. పరిస్థితులు యింతగా విషమిస్తవని మొదటనే వూహించివుంటే కామినిని స్వేచ్ఛగా వదలివుండేవాడు. ఆమెని కేవలం భయపెట్టడమే తప్ప యిందులో తనకి మరో వుద్దేశ్యమేలేదు. కామిని తనకి కావాలి. ఏదో కొన్నాళ్లుగాదు. జీవితాంతం. కాని తను వివాహమాడి తండ్రి వంశాన్ని నిలబెట్టాలి. అయితే అది కామిని ద్వారాగాదు. మరో రాచకన్యద్వారా. అందుచేత కామిని వేశ్యగానే వుండాలి. తన ఆనంద లబ్ధికోసమే ఆమె. స్వస్త్రీలో వుండవలసిన మరే సంబంధమూ ఆమెతో వుండడానికి వీలులేదు. కామిని తన కులస్త్రీ కావాలని వుబలాటపడుతున్నట్లు పొరబాటుగా వూహించాడు. అది వీలుపడదని తెలియపరచడానికే తానీ పన్నుగడ పన్నాడు. కాని అది కామినిని తనునుండి, శాశ్వతంగా వేరుపరచి ఆమె ప్రాణాలకే ముప్పుతీసికొని రాబోతున్నది. తాను ఆమె నెంత అవహేళన చేసినా ఆమె తనపథంలో నిబ్బరంగా పురోగమిస్తున్నది. ఫలితాన్ని గూర్చి ఆమె యేమీ భయపడడంలేదు. అబలయైన ఒక స్త్రీ— అందులో చంచలమైన వేశ్య, యింత గుండె నిబ్బరంతో మహర్షులకైనా సాధ్యంగాని ఆత్మనిగ్రహంతో మడమ త్రిప్పని వీరవనితలాగా తన గమ్యం వైపు దూసుకుని పోతూంటే— మహారాజవంశంలో పుట్టి మహావీరుడని చెప్పబడుతున్న తాను తనని నమ్ముకున్న ఒక నిర్భాగ్యురాలిని దగాచేసి ఆమె బ్రతుక్కి నిప్పు అంటించి, దాన్లో ఆమె నిశ్శబ్దంగా దహించుకొని పోతూంటే తానేమీ చేయలేక కళ్ళప్పగించి చూస్తున్నాడు. ఇంత నీచమైన ఆత్మవంచనకీ, పరవంచనకీ పాల్పడ్డ తాను రేపు కామిని లాంటి మరొక యువతినే పెళ్ళిచేసికొని, తన తండ్రి అనంతరం గద్దెనెక్కి భగవంతుని ప్రతినిధియైన ధర్మరక్షకుడు, ప్రజారక్షకుడు, న్యాయరక్షకుడు అని పొగడబడుతూ, ఎక్కడన్నా నిజమైన ధర్మం తలయెత్తితే న్యాయసూత్రాల పేరుమీదుగా భూమిలో కప్పిపెడతాడు. మళ్ళీ పైకి రాలేనంత లోతుకి. ఛీ ఛీ! నిజంగా కామిని అదృష్టవంతురాలు. ఇలాంటి మూర్ఖులమధ్య నివసించే అవమానాన్నుండి విముక్తి పొందుతోంది. కాని ఆమెలోని...' అతని గుండెల్లో కన్నీరు కురిసింది. తాను చేతులారా రెండు హత్యల్ని చేస్తున్నాడు. ఈ హత్యాకాండవల్ల తాను సిద్ధించుకోనబోయే మహాసుఖమేమిటి? అతను అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు. అతనితో బాటు త్యాగం, పట్టుదల పందెం కాసి నిలబడినవి మహారాజు మందిరం వైపుగా పారిపోయాయి ఆ మూడు మూర్తులూ.

మహారాజు తన ఆలోచనా మందిరంలో దీనంగా పచార్లు చేస్తున్నాడు. మదనవర్మ రావడంచూసి,

'రా నాయనా! యిలా కూర్చో అలానై పోయావేం?' అని ప్రశ్నించాడు.

'క్షమించండి మహారాజా! నేను మీ కుమారుడి హోదాలో రాలేదు. ఒకసామాన్య పౌరుడిగా మీవద్దకి వచ్చాను న్యాయభిక్ష కోసం.'

'ఇప్పుడు విచారించి యేమి లాభం నాయనా! నీవు సర్వాధికారివని అనుకున్నావు. చట్టాన్ని నీ కనుసన్నల్లో నడిపించగల ననుకున్నావు. అవతల రాజవంశాచారాల్ని గూర్చి, అనూచానంగా వస్తూన్న న్యాయ సాంప్రదాయాల్ని గూర్చి ఆలోచించనైనాలేదు. ఇప్పుడు యువరాజువైన సామాన్య పౌరుడివైనా చేయగల్గిందేమీలేదు. మనస్సు స్థిమిత పర్చుకో నాయనా.'

'అలా జరగడానికి వీలులేదు మహారాజా! కామినికోరింది తనని మానవిగా బ్రతకనిమ్మని మీరలాంటి అవకాశాన్ని కల్గించలేకపోతే మీ చట్టం అందుకు అంగీకరించకపోతే, మీ ప్రజలు అందుకు విముఖులైతే ఆమె హక్కుని నేనే సాధించి పెడతాను. కామిని కోసం నా సర్వస్వాన్నీ— అవసరపడితే మీ కరుణాపూరితమైన వాత్సల్యాన్ని సహితం బలిచేస్తాను.'

'ఇంత వుద్రేకం యెందుకు నాయనా! నెమ్మదిగా ఆలోచించు.'

'ఉద్రేకంలేదు. నెమ్మదీలేదు. ఉన్నదల్లా ఒక్కటే సమాన న్యాయప్రదానానికి దీక్ష. ఎక్కువమంది వప్పుకొన్నదల్లా న్యాయం కాబోదు. కామిని వట్టిమనిషి గాదు...... గర్భిణి.'

మహారాజు వులిక్కిపడ్డాడు. అతని చూపు ఒక్కక్షణంపాటు నిలిచిపోయింది అతని గొంతులో కన్నీరు గూడుకట్టుకొనిపోయి గద్గదమైంది. 'చాల సంతోషం నాయనా! పాపం! కామిని అన్నివిధాలా నిర్భాగ్యురాలేమో ననుకున్నాను. కాని భగవత్కృప. భార్యా వియోగంతోబాటు పుత్రవియోగం గూడా కలుగుతుందేమోనన్న స్వార్థపూరితమైన వ్యథతో నిన్ను నీకర్తవ్యంనుండి చ్యుతుణ్ణి చేయలేను. శుభమవుతుంది. పోయిరా నాయనా!'

'ఒక్కసారి కామినిని చూడడానికి మీ అనుమతికోసం వచ్చాను.'

మహారాజు ప్రక్కనేవున్న గంట మ్రోగించాడు. ప్రవేశించిన సైనికుడితో "యువరాజువారి ఆజ్ఞల్ని పాలించు" అని తన అంగుళీయకాన్ని మదనవర్మ కిచ్చాడు.

సైనికుడు దారితీస్తుంటే మదనవర్మ కారాగారం చేరుకున్నాడు. పహారాయిస్తున్న సైనికుడు కామినివున్న గది తలుపుతీసి తొలగిపోయాడు. తలుపు చప్పుడువిని ఆలోచనల్లో కూరుకొనిపోయివున్న కామిని వులిక్కిపడి లేచి నిలబడింది. ఆమె ఎదుట యువరాజు తలవంచుకొని నిలబడ్డాడు. ఆమె అతణ్ణి పలకరిద్దామనుకుంది. కాని ఏదో ఆవేగం ఆమె నిలువెల్ల విద్యుత్తులాగా కంపింపజేస్తోంది. చెక్కిళ్ళమీదుగా దుఃఖం జాలువారుతోంది. మదనవర్మ చివరికి తలయెత్తి చూశాడు. ఆమె కామినిగాదు. తన ప్రియురాలుగాదు. అసలు మానవిగాదు. మూ

భావించిన ఒక ఆశయం ఒక స్థిరభావంయొక్క రూపకల్పన. ఇలాంటి స్త్రీని తాను వేశ్యగా భావించాడు. పైగా వేశ్యగానే వుంచాలని ప్రయత్నించాడు. ప్రతిగా ఆమె తన ప్రాణాల్ని పణంగాపెట్టింది. ఆమె తిరిగి రక్షించేవరకూ ముఖంచూపే అర్హతగూడ లేదు తనకి. గిరుక్కున తిరిగి ద్వారంవైపుగా నడవసాగాడు. కాని కామిని చివాల్న వంగి అతని చేతిని పట్టుకొని ఆపింది.

'వదులు కామినీ! నిన్ను రక్షించుకోనగలిగితేనే నిన్ను తాకే అర్హత నాది.

'ఉద్రేకపడకండి! జరిగిందేదో జరిగే పోయింది. మీరు యిప్పటికైనా సన్నద్ధం చేసుకున్నారు నేనింతకంటే కోరేదేమీ లేదు. కాగా నావంటి నిర్భాగ్యురాలికోసం మీరింత శ్రమపడడంగూడా నాకిష్టంలేదు. దేశంలో అరాజకం ప్రబలడం- వార్ధక్యంలో వున్న మీ తండ్రిగారి బరువుని మరింత అధికం చేయడం- యిదంతా కామినివల్లే నన్న అప్రదిష్ట తీసికోనిరాకండి. వెళ్ళి మనస్సుని స్థిమితపరుచుకోండి. మీరు సంతోషంగా వున్నప్పుడు నేను జ్ఞాపకంవస్తే ఒక్కక్షణం పాటు అభిమానంతో స్మరించండి.'

'చివరికి నీవుగూడా నన్ను అవమానిస్తున్నావా! కామినీ !

'మిమ్మల్ని అవమానిస్తున్నానా? నామనస్సేమీ బాగుండలేదు. మీరు వెళ్ళిపొండి'

'అలాగే. కాని నిన్ను రక్షించుకోలేక పోయినప్పుడు మనిద్దర్నీగూర్చి కనీసం ఒక్కసారైనా కన్నీరు కారుస్తావే కామినీ! వెళుతున్నాను.' అంటూ వడివడిగా బయటికెళ్ళి పోయాడు.

మరునాడు న్యాయస్థానంలో తిరిగి హాజరుపరిచారు కామినిని. ఆనాడు అభియోగంలో తీర్పు చెప్పేరోజు. నగరంలోని జనులందరూ ఏమవుతుందో నన్న ఆతురతతో వున్నారు. కామినిని ప్రవేశపెట్టిన కొద్దిసేపటికి మహారాజరుదెంచి న్యాయమూర్తి ఆసనాన్ని అలంకరించాడు. అతని వెనుకనే యువరాజుగూడా విచ్చేశాడు. మహారాజు న్యాయస్థాన సభ్యులనుద్దేశించి యిలా అన్నాడు.

“మహాశయులారా! మీరు ప్రజల అభిరుచులకీ, వారి వుద్దేశ్యాలకీ ప్రతినిధులు ప్రజాసామాన్యంతో అత్యంత పరిమితమైన సన్నిహితత్వం కల్గిన మహారాజు ప్రజల పరిస్థితిని అవగాహన చేసికొని న్యాయం కలుగజేయడం సాధ్యపడదనే భావంతోనే యిచ్చట మీ వునికి అత్యంత ప్రాముఖ్య మీయబడింది. మీ సలహాలతోనే ప్రజలకి సంబంధించిన సర్వవ్యవహారాలూ చక్కబెట్టడం అనూచానంగా వస్తున్న ఆచారం. దాన్ని నేను సర్వదా గౌరవిస్తాను. కాని నేటి పరిస్థితి అసాధారణంగా వుంది. ఈ కామిని అభియోగం కారణంగా ప్రజాసంబంధమైన విషయాల్లో అత్యంత ఆసక్తి బయలుదేరింది. మన వుద్దేశ్యాల్లోనో, మన న్యాయసూత్రావళిలోనో, లేకపోతే ప్రజాబాహుళ్యపు అభిరుచుల్లోనో ఎక్కడో మొత్తానికి కొంత లోటు సహజత్వాన్ని విభిన్నమైన సరళివున్నట్లు తోస్తోంది. రాజ్యాంగంగాని, శిక్షాస్మృతిగాని యివేమీ కానిపక్షంలో ప్రజగాని సరియైన మార్గాన్ని అనుసరించడానికి విముఖత్వం చూపుతున్నట్లు తోస్తోంది. కామిని వుద్దేశిస్తున్నది తప్పు అనీ, ఆమె శిక్షార్హయనీ నిర్ణయమైతే ఆమెని శిక్షించడం అనివార్యమే. కాని భగవంతుని పేరిట, ధర్మం పేరిట, న్యాయం పేరిట తీర్పు చెప్పేముందు, అది భగవంతునికీ, ధర్మానికీ న్యాయానికీ ఎంత సన్నిహితంగా వున్నదోనని పునరాలోచించుకోనడం న్యాయమూర్తులమైన మాకు మిగుల ఆవశ్యకం.

న్యాయవాది లేస్తూ 'మహారాజువారు మన్నించాలి. ప్రభువువారు న్యాయమూర్తులుగా యిదివరకెన్ని అభియోగాల్లోనో సాంప్రదాయానుగుణ్యంగా తీర్పివ్వడం జరిగింది. అనూచానంగా వస్తూన్న ఆచారాల్ని మన్నిస్తూ సాగిపోతున్న ప్రజా జీవన విధానాల్లో విప్లవం బయలుదేరి ప్రజాబాహుళ్యం కల్లోలంలో పడిపోయే ప్రమాదాన్ని నివారించే నిమిత్తం తమరు ప్రస్తుతం అమలులోవున్న శిక్షాస్మృతి ననుసరించే నిందితురాలిని దండించవలసిందని న్యాయస్థాన సభ్యులమైన మేము విజ్ఞప్తి చేసుకుంటున్నాము.

మహారాజు :- న్యాయస్థాన సభ్యులకీ, ప్రజాసందోహానికీ నేనొక్క సత్యాన్ని బహిరంగపరచవలసి వుంది. ఇంతకు ముందు నిందితురాలిని వేశ్యగా పరిగణించి విచారణ జరిపాము అక్కడే మనం పొరబడ్డామని నా వూహ. కామిని యువరాజువారితో కొంత కాలం సహచర్యం నెఱపింది. వివాహానంతరం స్త్రీ పురుషునితో గడపే విధంగా కొద్దినెలల్లో ఆమె తల్లి కాబోతుంది. ఆమె శిక్షార్హ అయితే ఆ శిక్షని ఆమె మాత్రమే అనుభవించాలి గాని ఆమె గర్భంలోని బిడ్డకూడా అనుభవించమని చెప్పే శక్తి మా శిక్షాస్మృతికి లేదు. అందువల్ల ఆమె ప్రస్తుత స్థితినిబట్టి యీ అభియోగంలో పునర్విచారణ జరగాలని ప్రతిపాదిస్తున్నాము.

న్యాయవాది :- న్యాయమూర్తియైన మహాప్రభువులు చిత్తగించాలి. ప్రజా ప్రతినిధులమని గుర్తింపబడి న్యాయస్థాన సభ్యత్వం పొందిన మేము ప్రజాజీవితంలో తుఫాను రేపే మార్పులకీ, చేర్పులకీ అంగీకరించలేమని మనవి. అధిక సంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం తీర్పివ్వాలని కోరుతున్నాము. శిక్షానుభవం తరువాతనే కల్గించవచ్చు. కాని తీర్పేమిటో యిప్పుడే నిర్ణయించమని అడుగుతున్నాము.

మహారాజు :- న్యాయస్థాన సభ్యుల్లో అధిక సంఖ్యాకుల అభిప్రాయానుసారం తీర్పివ్వడమే అనివార్యమయితే మా పరిపాలనలో తీర్పివ్వడం ఆఖరుసారి. ప్రజాసందోహానికి ఒక విజ్ఞాపనం మానవత్వానికి పరిణామం సహజమైనది. ఆ పరిణామాన్ని ఆచారం పేరుతో గాని మరింకా యే బలంతోనైనా గాని నిరోధించడమే రాక్షసత్వమంటే. ఆచారాలో ఆదర్శవంతమైనవి లేవనిగాదు మానవుడు మానవత్వపు వున్నత శిఖరాలని అధిరోహించకుండా అడ్డగించే ఆచారాల సంగతే నే నిక్కడ ప్రస్తావిస్తున్నాను. విధాయకాలు కావల

సిన నీతి సూత్రాలు ప్రబోధాలుగానే ఆగిపోతున్నవి ప్రజలు జీవిత విధానాల్లో యథేచ్ఛావర్తనులే అవుతున్నారు. వారికి చట్టరక్షణగూడా కల్పిస్తున్నది. యిలాంటి లోపభూయిష్టమైన చట్టానికి ప్రతినిధిగా ఆత్మవంచన చేసుకుంటూ నిజమైన ధర్మాన్ని అణచివేసే బాధ్యత నిర్వహించడం మాకు అలవిగాదని మనవి. తీర్పు ప్రకటించేముందు రాజ్య పరిత్యాగ విషయంలో సభ్యుల యభిప్రాయమేమిటో తెలుపగోరుతాము.

న్యాయవాది:- మేము వాంఛించేది చట్టానికి అనుగుణమైన తీర్పు. అంతకంటే మేము చెప్పగల్గిన దేమీలేదు.

'అయితే వినండి! చట్టానికి అనుగుణంగా ప్రజల పేరిట కామినికి...'

న్యాయవాది:- ప్రభువువారు పరంపరాగతమైన పద్ధతులన్ని మార్చివేస్తున్నారు.

మహారాజు:- సంపూర్ణమైన వివేచనతోనే చేస్తున్నాము. చట్టరీత్యా ప్రజలు కోరిన తీర్పుని మాత్రమే నేను నిర్ణయిస్తున్నాను. ధర్మం పేరిట, న్యాయం పేరిట తీర్పునిచ్చే అవకాశం లేకుండా చేశారు.

ప్రజలలో అలజడి బయలుదేరింది. వారిలో గుసగుసలు పోసాగారు, జనులు వుద్రేకంతో 'ఇలాకాదు అలా జరగడానికి వీలులేదు.' అని కేకలు వేయసాగారు బయటనుండి మరికొందరువచ్చి విషయమేమిటని ప్రశ్నిస్తున్నారు. వారిలో వారు తర్కించుకొంటున్నారు. చివరకు మహారాజు చేయెత్తి ఆగమని సౌంజ్ఞ చేశాడు. సద్దుమణిగిపోయింది. ఒక యువకుడు ముందుకువచ్చి ప్రణామం చేసి యిలా విన్నవించుకొన్నాడు.

'ప్రభూ! పాలకులు సర్వాధికారులు. అభియోగంలో తీర్పు నివ్వడానికి వారికి సర్వహక్కులు వున్నవి. కనుక తమరు పునరాలోచించి దైవం పేరిట, ధర్మం పేరిట తీర్పివ్వవలసిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.'

మహారాజు ఆసనంమీదనుంచే 'సర్వాధికారాలున్న మాట వాస్తవంగాదు. ధర్మమైనా అధర్మమైనా. నీతియైనా కాకపోయినా ప్రజాభీష్టం ప్రకారం నడవవలసిన పాలకునికి సర్వాధికారాలున్నవనడం సబబుగాదు. పాలకునికి సర్వాధికారాలుండడంగూడా అంత మంచిదిగాదు. సర్వాధికారాలున్నాయన్న భ్రమతోనే యువరాజువారు యీ అమానుష కార్యానికి తలపడ్డారు. కనుక మన ముందున్నవి రెండే మార్గాలు-మీరన్నట్లు నిజమైన న్యాయం కలగాలంటే యీ అభియోగం పునర్విచారణ జరగాలి. కాకపోతే తీర్పిచ్చిన మరుక్షణంలోనే మేము సింహాసనం నుంచి తప్పుకోవడానికి అంగీకరించాలి '

తిరిగి జనసందోహంలో అలజడి బయలుదేరింది మహారాజు విసుగుతో లేచి 'చెప్పవలసిందేమైనా వుంటే ప్రశాంతంగా నివేదించండి అలజడివలన ప్రయోజనంలేదు' అని మందలించాడు

జనసందోహంలోనుండి ఒక వృద్ధు ముందుకివచ్చి 'ప్రభూ! నేడు కౌశంబి యావత్తు యిదివరకెన్నడూ ఎరుగనంత వ్యథ చెందుతోంది. కనిపించని, వినిపించని భగవంతుని పేర, ధర్మం పేర ఎన్ని అన్యాయాలూ అక్రమాలు జరుగుతున్నా నిశ్చింతిగా వున్న ప్రజకి తమ పేరిట తమకోసం జరుగుతున్న యీ వొక్క తీర్పునిగూడా భరించే శక్తి లేకపోయింది. ప్రజల్లో జిజ్ఞాస బయలుదేరింది. తీర్పేమైనా ధర్మబద్ధంగానే వుండాలని తలపోస్తున్నారు. ప్రజాభిప్రాయలో భేదాలు వచ్చినవి గనుక ప్రజాప్రతినిధులుగూడా మారవలసివుంది. అభియోగం తిరిగి విచారింపబడాలని వాంఛిస్తున్నారు. తమ అభిప్రాయాన్ని ప్రతిబింబించే ప్రతినిధుల్ని ఏర్కొనే వరకూ తీర్పుని ఆపవలసిందిగా ప్రార్థిస్తున్నాము' అని ముగించాడు. 'అవును, అవును' అని జనం ఒక్కపెట్టున హోరెత్తిపోయింది. నాటికి సభ ముగిసింది.

నాల్గు రోజుల తర్వాత నూతన ప్రతినిధులు ఎన్నుకోబడ్డారు, వారు కామిని మీద అభియోగాన్ని పునర్విచారణ చేశారు. వారి నిర్ణయాలు యివి.

1. కామిని సమాజంలోని యితర స్త్రీలలాగా బ్రతకడం సాధ్యంగాకపోతే తను బ్రతకడం వృథా అనే భావంతో నిస్సహాయస్థితిలో ప్రాణార్పణకైనా సిద్ధపడడంవల్ల ఆమె యువరాజువారి యొక్క భార్యగానే ఉండదలచింది గాని, పట్టమహిషి కావాలనిగాని, తన సంతానానికి రాజ్యాన్ని కట్టబెట్టాలనిగాని దురాశలేదు.

2. ఆమె వుద్దేశ్యం నైతిక దృక్పథంతో గూడినదైనందువల్ల సమాజ విచ్ఛిత్తికి ప్రయత్నించిందన్న ఆరోపణ స్వార్థంతోనూ, పక్షపాతంతోనూ కూడుకొన్నట్టిది.

3. కామిని వేశ్యాసంజాతరాలైనా ఉన్నతమైన భావసంపదనీ, స్థిరసంకల్పాన్నీ, పవిత్రమైన ప్రవర్తన కల్గియుండడంవల్ల ఆమెని పట్టమహిషిగా చేయడానికి మేము సుముఖులము.

కామిని విముక్తి పొందింది.

ఆ రోజురాత్రి జాముసేపు ప్రొద్దుపోయాక పరదాలు దించి గొప్పగా అలంకరించబడిన రాజశకటంమీద తన పూర్వగృహంనుండి యువరాజు మందిరం వైపుగా వెళ్ళిపోయింది శాశ్వతంగా కామిని.

—సమాప్తము

చదవండి — చందాదారులుగా
చేరండి.
ఆంధ్రుల అభిమాన పక్షపత్రిక
చుక్కాని
సాలు చందా 4-50 విడిప్రతి 20 నపై